జపాన్‌కు చెందిన వాహన తయారీ సంస్థ హోండా.. థర్డ్ జనరేషన్‌గా దేశీయ మార్కెట్‌లోకి సరికొత్త అమేజ్ మాడల్‌ను విడుదల చేసింది. మూడు రకాల్లో లభించనున్న ఈ కారు ధరల శ్రేణి రూ.7.99 లక్షల నుంచి రూ.10.89 లక్షలుగా ఉన్నది.

జహీరాబాద్ నిమ్జ్‌లో ప్యూర్ ఈవీ ప్లాంట్

రూ.400 కోట్లతో ఏర్పాటు చేస్తున్న సంస్థ

హైదరాబాద్, డిసెంబర్ 4: రాష్ర్టానికి చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ప్యూర్ ఈవీ..తెలంగాణలో మరో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నది. ఇప్పటికే సంగారెడ్డి వద్ద ప్లాంట్ ఉండగా, కొత్తగా జహీరాబాద్ నిమ్జ్‌లో రూ.400 కోట్ల పెట్టుబడితో మరో ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పబోతున్నట్లు కంపెనీ ఫౌండర్, ఎండీ నిశాంత్ డొంగ్రీ తెలిపారు. 40 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయబోతున్న ఈ యూనిట్ వచ్చే రెండేండ్లలో అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. నెలకు 12 వేల నుంచి 15 వేల యూనిట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో కొత్తగా వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న సంగారెడ్డి ప్లాంట్‌తో 500 మంది ఉపాధి పొందుతున్నారన్నారు. కంపెనీకి చెందిన వాహనాలకు దేశవ్యాప్తంగా డిమాండ్ అధికంగా ఉండటంతో ఈ నూతన ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే ప్రస్తుతం దేశీయంగా 70 రిటైల్ అవుట్‌లెట్లు ఉన్నాయని, వచ్చే రెండున్నరేండ్లలో మరో 250 డీలర్‌షిప్‌లను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. మరోవైపు, స్కూటర్, మోటార్‌సైకిళ్లలోనూ కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది.

ప్రముఖ వంటనూనెల ఉత్పత్తి సంస్థ గోల్డ్‌డ్రాప్‌ను మరోసారి ప్రతిష్ఠాత్మక సీఐటీడీ అవార్డు వరించింది. ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్‌డ్రాప్ సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ మితేష్ లోహియా అందుకున్నారు.

9 నుంచి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనమండలి, శాసనసభ సమావేశాలు ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ జారీ చేసిన గెజిట్ ఆధారంగా అసెంబ్లీ కార్యదర్శి వీ నర్సింహాచార్యులు నోటిఫికేషన్ విడుదల చేశారు.

బుర్రా వీఆర్‌ఎస్‌కు ఆమోదం

నేడు టీజీపీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తేతెలంగాణ): సీనియర్ ఐఏఎస్ బుర్రా వెంకటేశం స్వచ్ఛంద పదవీ విరమణకు ఆమోదం తెలుపుతూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. విద్యాశాఖ స్పెషల్ సీఎస్‌గా పనిచేస్తున్న ఆయన్ని టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించిన విషయం తెలిసిందే.

అమెరికా-చైనా టెక్ వార్

ఇరు దేశాల మధ్య మళ్లీ వాణిజ్య యుద్ధం

సెమీకండక్టర్ ఇండస్ట్రీలో ఆధిపత్య పోరు

చిప్ తయారీ రంగం కేంద్రంగా పరస్పర ఆంక్షలు

ట్రంప్ రాకముందే రాజుకున్న మంటలు



వాషింగ్టన్/బీజింగ్, డిసెంబర్ 4: అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మళ్లీ మొదలైంది. అయితే ఈసారిది టెక్నాలజీ వార్‌ను సంతరించుకున్నది. చిప్ తయారీపై తీవ్ర ప్రభావం చూపేలా ఇరు దేశాలు పరస్పర ఆంక్షల్ని, నిషేధాల్ని తెచ్చిపెట్టుకున్నాయి మరి. ఈ మేరకు సోమవారం బైడెన్ సర్కారు నిర్ణయాలుంటే.. వాటికి ప్రతిగా మంగళవారం జిన్‌పింగ్ ప్రభుత్వం నిర్ణయాలు వచ్చాయి. నిజానికి గ్లోబల్ సెమీకండక్టర్ ఇండస్ట్రీలో అమెరికా, చైనాలు ఆధిపత్యం కోసం గత కొంతకాలం నుంచి కొట్టుకుంటున్నాయి. దాన్ని తీవ్రతరం చేస్తూ అమెరికా కొన్ని కొత్త నిబంధనల్ని తీసుకొచ్చింది. ఇవి 140 చైనా సంస్థల్ని ప్రభావితం చేస్తున్నాయి. ఇందులో ప్రధాన సెమీకండక్టర్ తయారీ సంస్థలైన పయోటెక్, సైక్యారియర్, నౌరా టెక్నాలజీ గ్రూప్‌లున్నాయి. కాగా, అడ్వాన్స్‌డ్ సెమీకండక్టర్ (చిప్) తయారీ టెక్నాలజీ చైనాకు అందకూడదనే లక్ష్యంగా ఆయా ఎగుమతులపై అమెరికా ఆంక్షల్ని విధించినట్టు తెలుస్తున్నది. కటింగ్-ఎడ్జ్ అడ్వాన్స్‌మెంట్స్ సాంకేతికతలో చైనా దూకుడుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో దానికి బ్రేకులు వేసేందుకే ఆ టెక్నాలజీలో బలంగా ఉన్న అగ్రరాజ్యం ఈ చర్యలకు దిగిందన్న అభిప్రాయాలు ఇండస్ట్రీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి.

చైనా ప్రతీకార చర్యలు

అమెరికా తీరుకు చైనా గట్టిగానే స్పందించింది. సెమీకండక్టర్ల తయారీలో కీలక పాత్ర పోషించే విడిభాగాల ఎగుమతులకు బ్రేక్ వేసింది. అమెరికాకు గాలియం, జర్మేనియం, ఆంటిమోని తదితర ప్రధాన హై టెక్నాలజీ సరకు రవాణాకు కళ్లెం వేసింది. జాతీయ భద్రతపై ఆందోళనల దృష్ట్యా మిలిటరీ కోసమైనా, పౌర అవసరాల కోసమైనా జరిగే వీటి ఎగుమతుల్ని నిషేధిస్తున్నట్టు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇంతకుముందు వీటి ఎగుమతులపై ఆంక్షలుండగా, ఇప్పుడు పూర్తిగా నిషేధాన్ని తెచ్చింది. ప్రపంచవ్యాప్తంగా గాలియం, జర్మేనియం లభ్యత చాలా చాలా తక్కువగా ఉన్నది. దొరికే ఆ కొద్ది నిల్వలు సైతం చైనాలోనే ఎక్కువగా ఉన్నాయి. కాగా, సెల్‌ఫోన్లు, కార్లు, సోలార్ ప్యానెల్స్, మిలిటరీ టెక్నాలజీల్లో వాడే కంప్యూటర్ చిప్స్ తయారీకి ఈ ముడి పదార్థాలన్నీ కూడా చాలా చాలా కీలకం. ఇంకా చెప్పాలంటే మిలిటరీ అప్లికేషన్ల దగ్గర్నుంచి కృత్రిమ మేధస్సు వరకు ఈ సెమీకండక్టర్లే ప్రధానం. దీంతో అమెరికా-చైనా వాణిజ్య సంబంధాలు ఒక్కసారిగా చెడినట్టైంది. అంతకుముందు అమెరికా.. కొత్త తరం సాంకేతికతతోకూడిన చిప్‌ల తయారీలో వినియోగించే పరికరాలు, అత్యున్నత శ్రేణి మెమరీ చిప్స్, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల ఎగుమతుల్ని కఠినతరం చేసింది. గతంలోనూ వీటిపై నిషేధం విధించినా ఆ తర్వాత సడలించింది. మానవ సాయంతో నిమిత్తం లేకుండా స్వయంప్రతిపత్తితో పనిచేయగలిగిన ఆయుధాల తయారీలో ఈ చిప్‌లే కీలకం. వాటి విడిభాగాలు ప్రస్తుతం అమెరికా నుంచే చైనాకు పెద్ద ఎత్తున వెళ్తున్నాయి.

ట్రంప్ రాకముందే..

అమెరికా నూతన అధ్యక్షుడిగా మరోసారి డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది జనవరిలో గద్దెనెక్కబోతున్నారు. ఈ క్రమంలో ట్రంప్ వచ్చిన తర్వాత అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మళ్లీ మొదలవుతుందన్న అంచనాలు నెలకొన్నాయి. కానీ ఇప్పుడే ఆ వాతావరణం ఏర్పడటం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. నిజానికి ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కంటే ఆ స్థానంలో ముందున్నది ట్రంపే. అప్పుడు ట్రంప్ దూకుడు.. చైనాతో పరస్పర సుంకాలకు దారితీసింది. కానీ బైడెన్ రాకతో పరిస్థితులు కొంత శాంతించాయి. అయినప్పటికీ గత మూడేండ్లలో అమెరికా-చైనా మధ్య ఈ రకమైన పోరు వస్తూపోతూనే ఉన్నది. ఇప్పుడది తీవ్రరూపం దాల్చగా.. ట్రంప్ రాకతో ఇంకెంత తీవ్రతను సంతరించుకుంటుందోనన్న ఆందోళనలు అంతటా వ్యాపిస్తున్నాయిప్పుడు. ఇక ట్రంప్ హయాంలో చైనా నుంచి అమెరికాకు పెద్ద ఎత్తున జరిగే ఎగుమతుల కట్టడే లక్ష్యంగా సుంకాల పెంపు జరిగింది. కానీ ఇప్పుడు చిప్ తయారీలో ఆధిపత్యం కేంద్రంగా నిర్ణయాలుంటున్నాయి. మొత్తానికి వచ్చే ఏడాది నుంచి సెమీకండక్టర్ ఇండస్ట్రీల్లో అలజడులు ఖాయమనే చెప్పవచ్చు.

భారత్‌కు లాభమేనా?

అమెరికా-చైనా మధ్య చోటుచేసుకున్న ఈ ట్రేడ్ అండ్ టెక్ వార్.. భారత్‌కు లాభమేనా? అంటే అవుననే సమాధానాలే వస్తున్నాయి. ఇందుకు ట్రంప్ హయాంలో వచ్చిన అవకాశాల్నే గుర్తుచేస్తున్నారు. నాడు చైనాతో అమెరికా వాణిజ్యం పడిపోగా.. భారత్‌సహా మరికొన్ని దేశాలకు పెరిగింది. అమెరికాకు భారత్, వియత్నాం, మెక్సికో నుంచి ఆయా ఉత్పత్తుల ఎగుమతి పుంజుకున్నది. ఇప్పుడు కూడా అమెరికా సాయంతో సెమీకండక్టర్ ఇండస్ట్రీలో భారత్ నిలదొక్కుకోవచ్చన్న అంచనాలున్నాయి. నిజానికి అంతర్జాతీయంగా భారత్ ఎదుగుదలను చైనా అడ్డుకుంటున్నది. కానీ ఇదే సమయంలో భారత్‌పట్ల అమెరికా సానుకూల వైఖరిని ప్రదర్శిస్తున్నది. పైగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, డొనాల్డ్ ట్రంప్‌కు నడుమ మంచి స్నేహభావం ఉండటం కూడా ఇక్కడ కలిసొస్తుందని అంటున్నారు. భారత్ వంటి పెద్ద మార్కెట్‌ను వదులుకోవడం అమెరికాకు నష్టమేనని, కాబట్టి సాంకేతికంగా అగ్రరాజ్యం నుంచి సహకారం ఉంటుందనే ఇండస్ట్రీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయితే అమెరికా తాజా నిర్ణయం జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్ తదితర దేశాలనూ కొంత ఇబ్బంది పెడుతున్నది. దీంతో ఆసియా మార్కెట్‌లో అమెరికా-చైనా ట్రేడ్ వార్ గట్టిగానే ప్రకంపనల్ని సృష్టించేలా ఉన్నది.

యూపీఐ లైట్ పరిమితి 5 వేలకు పెంపు

ముంబై, డిసెంబర్ 4: యూపీఐ లైట్‌కు సంబంధించి ఆర్థిక లావాదేవీలు జరిపేవారికి రిజర్వుబ్యాంక్ శుభవార్తను అందించింది. యూపీఐ లైట్ వ్యాలెట్ పరిమితిని రూ.2 వేల నుంచి రూ.5 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే ఉద్దేశంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. అలాగే ఒక్కో లావాదేవీ పరిమితిని రూ.500 నుంచి రూ.1,000కి సవరించింది. ఎలాంటి పిన్ నంబర్ లేకుండానే ఆఫ్‌లైన్‌లో మొబైల్ ద్వారా లావాదేవీలు జరిపేందుకుగాను ఆర్బీఐ గతంలోనే లైట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేవల కోసం యూపీఐ లైట్ వ్యాలెట్‌ను నగదు ఉంచాల్సి ఉంటుంది.

హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్

ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ

హైదరాబాద్, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ): ఇంటర్నెట్ సర్ఫ్ ఇంజిన్ దిగ్గజం గూగుల్..హైదరాబాద్‌లో సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్(జీఎస్‌ఈసీ)ని నెలకొల్పడానికి ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అధికారిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. దేశంలో తొలి సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ కాగా, అలాగే ప్రపంచంలోనే ఐదోది కావడం విశేషం. ఈ జీఎస్‌ఈసీ ఏర్పాటుకు సంబంధించి గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాయల్ హాన్సెన్..రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ-పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం హాన్సెన్ మాట్లాడుతూ..డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో రాష్ట్రం ముందంజలో ఉన్నదని, ప్రపంచవ్యాప్తంగా ఐటీ, ఐటీ ఇంజినీరింగ్ సర్వీసెస్ అభివృద్ధికి హైదరాబాద్ కేంద్రంగా ఉన్నదన్నారు. ఈ నూతన సేఫ్టీ సెంటర్ ద్వారా సైబర్ సేఫ్టీ సమస్యలను వేగవంతంగా పరిష్కరించడానికి వీలు పడనున్నదన్నారు. అలాగే ఈ సెంటర్‌తో వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ఆన్‌లైన్ భద్రతా ఉత్పత్తులకు కిక్కు

జీఎస్‌ఈసీ ప్రత్యేకమైన అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ హబ్. ఇది అధునాతన భద్రత, ఆన్‌లైన్ భద్రతా ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించనున్నది. ఏఐ ఆధారిత భద్రత, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, పరిశోధకులకు ఈ సేఫ్టీ సెంటర్ సహకారం అందించనున్నది. ఇదిలావుంటే దేశంలో నైపుణ్యాభివృద్ధిని, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలు పెంపొందించే లక్ష్యంగా ఈ సెంటర్ పని చేయనున్నది.

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాయల్ హాన్సెన్

కొనసాగుతున్న రూపీ పతనం

ముంబై, డిసెంబర్ 4: దేశీయ కరెన్సీకి మరిన్ని చిల్లులు పడ్డాయి. అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో రూపాయి చారిత్రక కనిష్ఠ స్థాయికా జారుకున్నది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 7 పైసలు కోల్పోయి 84.75 వద్దకు పడిపోయింది. గ్లోబల్ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భగ్గుమనడం వల్లనే కరెన్సీలు పతనం చెందాయని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. 84.66 వద్ద ప్రారంభమైన రుపీ-డాలర్ రేటు 64.65-84.76 స్థాయిలో కదలాడింది.

తాగి వాహనం నడిపిన వ్యక్తికి సమాజ సేవ శిక్ష

కాజీపేట, డిసెంబర్ 4 : కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడిపిన ఓ వ్యక్తికి న్యాయమూర్తి రెండు రోజుల సమాజ సేవ శిక్ష విధించారు. బుధవారం కాజీపేట ట్రాఫిక్ సీఐ నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో డ్రైంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన బర్నాడ్ హుగ్ లాజరస్‌ను కోర్టు కానిస్టేబుల్ కుమార్ రెండో శ్రేణి కోర్టు న్యాయమూర్తి రాజశేఖర్‌రెడ్డి ఎదుట హాజరుపర్చారు. న్యాయమూర్తి లాజరస్‌కు రెండు రోజులు సమాజ సేవ చేయాలని తీర్పు ఇచ్చారని తెలిపారు. నిందితుడిని కాజీపేట సర్కిల్ మున్సిపల్ కమిషనర్ ఎదుట హాజరు పర్చినట్లు తెలిపారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు, డిసెంబర్ 4 : గూడెప్పాడ్ శివారులోని మెయిన్ రోడ్డు భూమిలో రేకుల షెడ్డు తొలగించి, తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు వంగర దుర్గా ప్రసాద్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరకాల పట్టణానికి చెందిన అంకం మార్కండేయతో పాటు మరో ముగ్గురు కలిసి తనకు ఉన్న 0.20 గుంటల భూమిలో రేకుల షెడ్డు తొలగించి, ఇనుప రాడ్డుతో తనపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. వీరిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై పరమేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మాడల్ స్కూళ్లలో ఏఎన్‌ఎం పోస్టులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 4 : జిల్లాలోని తెలంగాణ మాడల్ స్కూల్స్ గర్ల్స్ హాస్టల్స్ ఎల్కతుర్తి, భీమదేవరపల్లిలో కాంట్రాక్టు పద్ధతిలో ఏఎన్‌ఎంగా పని చేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి తెలిపారు. ఇంటర్మీడియట్ పాస్ అయి ప్రభుత్వ గుర్తింపు కలిగిన సంస్థ నుంచి ఏఎన్‌ఎం ట్రైనింగ్ సర్టిఫికెట్ పొంది ఉండాలని, వయసు 18 నుంచి 44 సంవత్సరాలల్లోపు ఉండాలన్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్స్‌తో (అటెస్టెడ్ కాపీలు) జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈ నెల 11న సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు.

సర్కారు దవాఖాన పరిసరాలు ఇలాగేనా?

- **జంగిల్‌ను తలపిస్తున్న హాస్పిటల్ ప్రాంతం**
- **పట్టించుకోని వైద్యాధికారులు.. ఇబ్బందులు పడుతున్న ప్రజలు**

శాయంపేట, డిసెంబర్ 4 : శాయంపేట సర్కారు దవాఖాన పరిసరాలు అధ్వానంగా మారాయి. చెట్లు, ముళ్లపొదలతో అడవిని తలపిస్తున్నది. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో ఇటీవల సందర్శించిన డీఎంహెచ్‌వో అప్పయ్య అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శికి చెప్పి క్లీన్ చేయాలని సూచించినట్లు తెలిసింది. అయినా సిబ్బంది మాత్రం పట్టించుకోవడం లేదు. ఆస్పత్రి ఆవరణలో భారీ చెట్లున్నాయి. వీటితో పాటు ముళ్లపొదలు పెరిగాయి. ఆస్పత్రి ప్రహరీ పక్క నుంచి ముళ్లపొదలు, పిచ్చి చెట్లతో జంగిల్‌ను తలపిస్తున్నది. అయితే ప్రహరీ పక్కనే కొన్ని కుంటుంబాలు నివాసముంటున్నాయి. మూడు వారాలుగా ఈ ముళ్లపొదల నుంచి ఇరవై అడుగుల భారీ కొండ చిలువ తిరుగుతున్నట్లు స్థానికులు చెప్పారు. ఇటీవల రాత్రివేళ ప్రహరీ వద్ద కొండ చిలువ కనిపించిందని, పట్టుకునేందుకు ప్రయత్నిస్తే ముళ్లపొదల్లోకి పోయిందని తెలిపారు. తరచూ ఆస్పత్రి ప్రహరీ ఎక్కి బయటకు వచ్చే ప్రయత్నం చేస్తున్నదన్నారు. ఇక్కడే ఎడ్లు, ఇతర పశువులను కట్టేశామని, పిల్లలు కూడా తిరుగుతుంటారని చెప్పారు. ఆస్పత్రి లోపలికి వెళ్లి కొండ చిలువను పట్టుకుందామంటే ముళ్లపొదల్లోకి పోతున్నదని, మనుషులు వెళ్లలేని పరిస్థితి ఉందని ఆవేదన చెందారు. వైద్యాధికారికి చెప్పినా చెట్లు, పొదళ్లను క్లియర్ చేయించడం లేదని వాపోయారు. పంచాయతీ కార్యదర్శికి చెబితే ఈజీఎస్ కూలీలు ఇప్పుడు రారని ఏం చేయలేమని చెప్పాడన్నారు. ఇప్పటికైనా ఆస్పత్రి ఆవరణలో ఉన్న ముళ్లపొదలను తొలగించి కొండచిలువను పట్టి తరలించాలని ఫారెస్టు అధికారులను వారు కోరారు. ఆస్పత్రి ఆవరణ, పరిసరాలను బాగు చేయాలని డీఎంహెచ్‌వో చెప్పి రోజులు గడుస్తున్నా వైద్యాధికారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంపై రోగులు మండిపడుతున్నారు.



సర్కారు దవాఖాన ఆవరణలో జంగిల్‌ను తలపిస్తున్న చెట్లు, ముళ్లపొదలు

ఎన్యుమరేటర్లు లేకుండానే డేటా ఎంట్రీ

శాయంపేట జీపీలో ఎన్యుమరేటర్లు లేకుండా డేటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు

తప్పులు జరిగే అవకాశముందని ప్రజల ఆందోళన

శాయంపేట, డిసెంబర్ 4 : ఇటీవల చేపట్టిన ఆర్థిక, సామాజిక, విద్య, కుల ఇంటింటి సర్వే డేటా ఎంట్రీ జరుగుతోంది. అయితే శాయంపేట పంచాయతీలో డేటా ఎంట్రీ ఎన్యుమరేటర్లు లేకుండా జరుగుతున్న దృశ్యం బుధవారం కనిపించింది. అయితే మూడు కంప్యూటర్లలో డేటా ఎంట్రీ చేస్తుండగా అక్కడే ఉన్న జీపీ కారోబార్ రమేశ్ తానే అన్ని ఎంట్రీ చేయిస్తున్నట్లు చెప్పడం గమనార్హం. మండలంలోని సర్వే డేటా ఎంట్రీని విట్స్ ఇంజినీరింగ్ కాలేజీతో పాటు శాయంపేట ప్రభుత్వ ఆఫీసుల్లో చేపట్టారు. అయితే సర్వే చేసిన ఎన్యుమరేటర్లు దగ్గరుండి డేటా ఎంట్రీ చేయాలని అధికారుల ఆదేశాలున్నాయి. ఎలాంటి తప్పులు లేకుండా నమోదుకు అధికారులు ఇలా చర్యలు తీసుకున్నట్లు తెలుస్తున్నది. అయితే ఎన్యుమరేటర్లు లేకుండానే ఆపరేటర్లు డేటా ఎంట్రీ చేస్తున్నట్లు తెలుస్తున్నది. ప్రజాపాలన దరఖాస్తుల వివరాలు ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేయడంతో అనేక మందికి పథకాలు అందడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కుల గణన సర్వేలో తప్పులు లేకుండా నమోదు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికే శాయంపేట ఎంపీడీవో ఫణిచంద్ర, సూపర్‌వైజర్‌కు కలెక్టర్ ఇటీవల షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

ఇంటర్ వర్సిటీ చెస్ పోటీలకు కేయూ విద్యార్థులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 4 : ఈ నెల 7వ తేదీ వరకు విశాఖపట్నం గీతం యూనివర్సిటీలో జరిగే సౌత్ వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ (మహిళా) పోటీల్లో పాల్గొనే కాకతీయ విశ్వవిద్యాలయ టీంను ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి వెంకయ్య తెలిపారు. వీరిలో హనుమకొండ కిట్స్ కాలేజీ నుంచి నవ్య, స్నేహిత, వరంగల్ ఎల్బీ కాలేజీ నుంచి దేవిక, విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కాలేజీ (కో-ఎడ్యుకేషన్) నుంచి మాధుర్య, ఖమ్మం టీఎస్ డబ్ల్యూఆర్డీసీ (గర్ల్స్) నుంచి శ్రావిక, వరంగల్ వెస్ట్ టీఎస్‌డబ్ల్యూఆర్డీసీ నుంచి భార్గవి ఉన్నారని, వీరికి కొత్తగూడెం టీఎస్‌డబ్ల్యూఆర్డీసీ (గర్ల్స్) వ్యాయామ అధ్యాపకురాలు శ్వేత మేనేజర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు.

చెస్ పోటీలకు ఎంపికైన కేయూ విద్యార్థులతో కార్యదర్శి వెంకయ్య

మారనున్న జిల్లా పరిషత్ స్వరూపం

- **12 మండలాలతో హనుమకొండ జడ్పీ**
- **పెరగనున్న జడ్పీటీసీలు, ఎంపీటీసీల సంఖ్య**

హనుమకొండ, డిసెంబర్ 4 : హనుమకొండ జిల్లా పరిషత్ స్వరూపం మారనుంది. ఇప్పటి వరకు వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లా ప్రజా పరిషత్‌లుగా కొనసాగగా గత నెలలో రెండింటిని పునర్విభజన చేసి హనుమకొండ, వరంగల్ జడ్పీలుగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఏడు మండలాలతో కొనసాగిన హనుమకొండ జిల్లా పరిషత్‌లో(వరంగల్ అర్బన్‌గా ఉన్న) పరకాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలు చేరనున్నాయి. దీంతో హనుమకొండ జడ్పీ 12 మండలాలతో ఏర్పాటు కానుంది. ఈ తాజా నిర్ణయం ఈ నెల 21వ తేదీ నుంచి అమలులోకి వస్తుందని ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 68లో పేర్కొంది. ఈ నేపథ్యంలో పరకాల రెవెన్యూ డివిజన్‌లో ఐదు మండలాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించే పనిలో జిల్లా పరిషత్ అధికారులు ఉన్నట్లు తెలిసింది. అదే విధంగా జడ్పీటీసీలు, ఎంపీటీసీల సంఖ్యతో పాటు జడ్పీకి వచ్చే నిధులు సైతం పెరగనున్నాయని అధికారులు తెలిపారు. కాగా, ప్రస్తుతం జిలా పరిషత్ పరిధిలోని ఏడు మండలాల్లో మొత్తం 2,89,065 మంది జనాభా ఉండగా, వీరిలో 1,44,253 మంది పురుషులు, 1,44,812 మంది మహిళలు ఉన్నారు.

మారనున్న స్వరూపం..

హనుమకొండ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లా పరిషత్‌లను హనుమకొండ, వరంగల్ జడ్పీలుగా మార్పు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో హనుమకొండ జడ్పీ స్వరూపం మారనుంది. జిల్లాలో 14 మండలాలుండగా ఇందులో హనుమకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో 9 మండలాలు, పరకాల డివిజన్ పరిధిలో ఐదు మండలాలు ఉన్నాయి. అయితే హనుమకొండ డివిజన్‌లోని 9 మండలాల నుంచి హనుమకొండ, కాజీపేట పట్టణ మండలాలు మినహాయిస్తే భీమదేవరపల్లి, ధర్మసాగర్, ఎల్కతుర్తి, హసన్‌పర్తి, ఐనవోలు, కమలాపూర్, వేలేరు మండలాలు ఉన్నాయి. పరకాల డివిజన్‌లోని ఆత్మకూర్, దామెర, శాయంపేట, పరకాల, నడికూడ ఐదు మండలాలు కలుపుకొని మొత్తం 12 మండలాలు హనుమకొండ జడ్పీలో ఉండనున్నాయి.

పెరగనున్న జడ్పీటీసీలు, ఎంపీటీసీలు..

ప్రస్తుతం హనుమకొండ జడ్పీ పరిధిలో జడ్పీటీసీలు, ఎంపీటీసీల సంఖ్య పెరగనుంది. ప్రస్తుతం ఉన్న ఏడు మండలాల పరిధిలో ఏడు జడ్పీటీసీలు, 86మంది ఎంపీటీసీలు ఉన్నారు. నూతనంగా పరకాల డివిజన్‌లోని ఐదు మండలాల్లో ఐదు జడ్పీటీసీలు, 45మంది ఎంపీటీసీలు ఉన్నారు. ఈ మొత్తం కలిపితే జిల్లా పరిషత్‌లో ప్రస్తుతం 12 జడ్పీటీసీలు, 131 మంది ఎంపీటీసీలు ఉండనున్నారు.

రిజర్వేషన్‌పై సందిగ్ధం..

హనుమకొండ జిల్లా పరిషత్‌గా మారినప్పటికీ స్థానిక సంస్థల రిజర్వేషన్‌పై సందిగ్ధత నెలకొందనే చర్చ సాగుతున్నది. 2018 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రెండు టర్మ్‌లకు (పది సంవత్సరాల వరకు) ఇప్పుడున్న రిజర్వేషన్ మార్పు ఉండదనే నిబంధన ఉన్నదని, దాని ప్రకారం మారుతుందో మారదో తెలియదని, ప్రభుత్వం తీసుకొనే నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని జడ్పీ అధికారులు అంటున్నారు. కాగా, హనుమకొండ జడ్పీ (పూర్వపు వరంగల్ అర్బన్ జడ్పీ) ఎస్సీ జనరల్, వరంగల్ జడ్పీ (పూర్వపు వరంగల్ రూరల్ జడ్పీ) జనరల్ మహిళగా రిజర్వేషన్ కొనసాగుతున్నాయి. జడ్పీలో కొత్తగా ఐదు మండలాలు చేరడంతో జానాభా సంఖ్య సైతం పెరిగే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ ప్రక్రియ మారే అవకాశం ఉందనే ప్రచారం కూడా ఉంది. మొత్తానికి ప్రభుత్వం తీసుకొనే నిర్ణయంతోనే జిల్లా పరిషత్‌ల రిజర్వేషన్ ఉంటుందనే వాదన వినిపిస్తున్నది. రాష్ట్ర సర్కారు ఏ నిర్ణయం తీసుకుంటుందో కొంతకాలం వేచి చూడాల్సిందేనని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఐనవోలు : ఓ ఇంట్లో కిందపడిన సామగ్రి

జిల్లాలో స్వల్ప భూకంపం

పరుగులు తీసిన ప్రజలు.. ఎక్కడ చూసినా ఇదే చర్చ

హనుమకొండ/ఐనవోలు/కమలాపూర్/నడికూడ, డిసెంబర్ 4 : జిల్లాలో బుధవారం ఉదయం భూమి కంపించింది. హనుమకొండ, వరంగల్, కాజీపేట ప్రాంతాలతో పాటు మండలాల్లో ఉదయం 7.26 గంటల తర్వాత రెండు నుంచి ఐదు సెకన్ల పాటు భూమి కంపించడంతో ప్రజలు ఆందోళన చెందారు. స్వల్పంగానే భూమి కంపించినప్పటికీ ఆందోళన చెందిన ప్రజలు ఇళ్లు, అపార్ట్‌మెంట్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఉదయమే కావడంతో కొందరు పడుకొని ఉండడంతో మంచం కదిలినట్లు కావడం, కూర్చున వారికి కొన్ని సెకన్ల పాటు అటూ ఇటూ ఊపినట్లు, కొన్ని ఇళ్లల్లో సామన్లు కిందపడడం లాంటి ఘటనలు జరిగాయి. జిల్లాలో ఎక్కడా చూసిన భూమి కంపించడంపైనే చర్చ జరగడం విశేషం. సుమారు 20 ఏళ్ల క్రితం ఇలానే జరిగిందని చర్చించుకున్నారు. భూకంపం రిక్టర్ స్కేల్‌పై 5.3గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కమలాపూర్, ఉప్పల్, అంబాల, గూడూరు, శ్రీరాములపల్లి, శనిగరం, భీంపల్లి, మర్రిపెల్లిగూడెం, వంగపల్లి, మాధన్నపేట, గూనిపర్తి, నేరెళ్ల, కానిపర్తి, దేశరాజ్‌పల్లి తదితర గ్రామాల్లో నాలుగు సెకన్లపాటు భూ ప్రకంపనలు వచ్చాయి.

భద్రకాళీ హుండీ ఆదాయం రూ.79.36లక్షలు

వరంగల్, డిసెంబర్ 4 : భద్రకాళీ ఆలయ హుండీని బుధవారం ఆలయ మహామండపంలో దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో లెక్కించారు. హుండీ ద్వారా ఆలయానికి రూ.79,36,043 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో శేషు భారతి తెలిపారు. హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని యూనియన్ బ్యాంకులో జమ చేసినట్లు చెప్పారు. హుండీలో 326 అమెరికా డాలర్లు, 20 కెనడా డాలర్లు, 10 యూఏఈ దిర్‌హమ్స్, 25 ఇంగ్లాండ్ పౌండ్స్, 5 ఆస్ట్రేలియా డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు వచ్చినట్లు అధికారులు తెలపారు. హుండీలో లభించిన వెండి, బంగారు వస్తువులను తిరిగి హుండీలో వేశారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళీ శేషు, కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, సురేందర్ పర్యవేక్షించారు. లక్ష్మి వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు, సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీలో పునరుద్ధరించాలి

మడికొండ, డిసెంబర్ 4 : వాల్మీకి బోయలను ఎస్టీలో పునరుద్ధరించాలని కోరుతూ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ సభ్యులు బుధవారం క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాల్మీకి బోయలను ఎస్టీలో పునరుద్ధరించి, వాల్మీకి ఫెడరేషన్ ఏర్పాటు చేసి నిధుల కేటాయింపు జరిగేలా శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. 1956కు పూర్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్టీలుగా రిజర్వేషన్ కల్పించగా, రాజకీయ కారణాల వల్ల బీసీ జాబితాలో చేర్చి అన్యాయం చేశారన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడ్డామన్నారు. కమిటీ నాయకులు భోగి కృష్ణమూర్తి, నిగ్గుల వెంకటప్రసాద్, కుర్ల మోహన్, భోగి లింగమూర్తి, ముచ్చు రాజ్‌కుమార్, రమేశ్, పేర్ల సురేశ్, కంచరపల్లి వెంకటయ్య, భోగి లింగయ్య, భోగి కేదారి, ముష్కె సాంబయ్య, మండల సురేశ్, భోగి వెంకటస్వామి, మేనుగు యాదగిరి, శంకర్, గోపనబోయిన రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, డిసెంబర్ 4 : హనుమకొండ టౌన్ పరిధిలో పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల నేపథ్యంలో నిట్ సబ్‌స్టేషన్ పరిధిలోని వడ్డేపల్లి ఫీడర్‌లో ఉదయం 9 నుంచి 12గంటల వరకు ఫాతిమానగర్, అఫ్జల్‌నగర్, రామాలయం ఏరియా, దర్గా ఏరియా, సోమిడి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విష్ణుపురి వాటర్ ట్యాంక్, పోలీస్ స్టేషన్, డాక్టర్ వెంకట్‌రెడ్డి ఆస్పత్రి, సోమిడిరోడ్డు ఏరియాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.